సర్వే.. సాగుతోంది..

ముందుకు సాగని కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ

- సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు
- మొత్తం దరఖాస్తులు 12 వేలు
- సర్వేలో పరిశీలించినవి 2100



సికింద్రాబాద్‌లోని సహాయ పౌరసరఫరాల కార్యాలయం

సికింద్రాబాద్: పదేళ్ల నిరీక్షణ తరువాత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త రేషన్ కార్డుల జారీ ప్రకియ సికింద్రాబాద్ ప్రాంతంలో ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. సిబ్బంది కొరతతో దరఖాస్తు దారుల వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసే సర్వే ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సర్వే పూర్తి చేసిన కొద్దిపాటి దరఖాస్తుల పరిస్థితులను ఆన్‌లైన్ చేయడానికి సర్వర్ మొరాయింపు సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో రేషన్ కార్డుల జారీ కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పట్లో ఓ కొలిక్కి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

- సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి వచ్చిన వేలాది దరఖాస్తులను ఇంకా పరిశీలించే పనుల్లోనే రేషనింగ్ అధికారులు, సిబ్బంది మునిగి తేలుతున్నారు. వేల సంఖ్యలోని దరఖాస్తులను పరిశీలించేందుకు పదుల సంఖ్యలో కూడా ఉద్యోగులు లేకపోవడమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది. గత జనవరి మాసంలో కేవలం 1497 మంది లబ్ధిదారులను కొత్త కార్డులు జారీ చేసేందుకు ఎంపిక చేసిన అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఆ తరువాత అర్హులందరికీ కార్డులు ఇస్తామని, ఇందుకోసం దరఖాస్తులు అన్నింటినీ పరిశీలించి లబ్ధిదారులను తేల్చాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

సిబ్బంది కొరత.. సాంకేతిక సమస్యలు..

నియోజకవర్గంలో రేషన్‌కార్డుల కోసం 12 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 4,100 మంది, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 6,900 వేల దరఖాస్తులు అందాయి. అయితే మొదటి విడత ఒక 5వేల దరఖాస్తులను ప్రాథమికంగా సర్వే చేయాలని అధికారులు నిర్ణయించారు.

- గతనెల 11వ తేదీ నుంచి దరఖాస్తుల ఇంటింటి సర్వే ప్రారంభం అయింది. సర్వే కోసం ఏర్పాటు చేసిన ఐదు బృందాల్లో 20 మాత్రమే మంది ఉద్యోగులు ఉన్నారు. కొద్ది మంది ఉద్యోగులు మాత్రమే సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో దరఖాస్తులు వేల కొద్ది పెండింగ్‌లోనే ఉంటున్నాయి. తమకు అందిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వే ద్వారా 2100 దరఖాస్తు దారుల వాస్తవ స్థితిగతులను మాత్రమే అధికారులు సేకరించగలిగారు. ఇదిలా ఉండగా కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్న క్రమంలోనే జాప్యం జరుగుతున్నట్టు రేషనింగ్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో ఉద్యోగి రోజుకు 20 నుంచి 50 ఇండ్లను సందర్శించి వివరాలు సేకరించాలని అధికారులు ఆదేశిస్తున్నారు, అయితే సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత ఫలితంగా రోజుకు 10 కి మించి దరఖాస్తుల పరిశీలన చేయలేకపోతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా 'నీట్'

సనత్‌నగర్: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)–2025 ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 720 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 706 మంది హాజరయ్యారు. బేగంపేట పీజీ కళాశాలలో 720 మంది అభ్యర్థులకు గాను 704 మంది పరీక్ష రాశారు. బేగంపేటలో ఆయా కేంద్రాల వద్ద బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇక అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు గాను 236 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

నార్త్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో 11 కేంద్రాలు..

నార్త్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో నీట్ పరీక్ష కోసం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా 5,000 పైచిలుకు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాలకు దారితీసే అన్ని ముఖ్యమైన జంక్షన్లు, రోడ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు.



బేగంపేటలో నీట్ పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు అల్ ది బెస్ట్ చెబుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన సుందర్‌నగర్ కాలనీ నూతన కమిటీ సభ్యులు..

సనత్‌నగర్: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని సుందర్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఇటీవల నూతనంగా ఎన్నికైంది. ఈ నేపథ్యంలో ఆదివారం నూతన కమిటీ సభ్యులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకుని తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు కంజర్ల అమర్నాథ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 40, పందిరి బీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 21, దొండ 23, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 75, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



సనత్‌నగర్: ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు) సమస్యలపై జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయ్‌నగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి ఎండీ డాక్టర్ నాగరాజు, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ రాధ తదితరులు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. దాదాపు 100 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.25 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అందజేశారు. అమీర్‌పేట డివిజన్‌లోని బాపూనగర్‌కు చెందిన కల్లీబాయి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరైంది. ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో లబ్ధిదారురాలి కుమారుడికి ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎంఈఓ



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాశాఖాధికారి శ్రవణ్ కుమార్

సికింద్రాబాద్: పదవతరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించిన సీతాఫల్‌మండి అమరావతి సంస్థల విద్యార్థులను ఎంఈఓ శ్రవణ్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన నగదు బహుమతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు చేయూతను అందించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన తేజస్విని (579), సుమయాఫాతిమా (570), పి.గణేష్ (569), ఎ. మణికంఠ (558), బి. నిషాంత్ (556) లను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాలల నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్

బంజారాహిల్స్: మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇప్పటి వరకు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన పరశురామ్‌ను సీసీఎస్‌కు బదిలీ చేశారు.

జాబ్ పేరిట మోసం..

సనత్‌నగర్: పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ లింక్‌ను ఓపెన్ చేసిన పాపానికి ఓ యువకుడిని నమ్మించి రూ.1,03,000 కాజేసిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గత నెల 24న సనత్‌నగర్‌కు చెందిన రోహన్ ఫోన్‌కు వాట్సాప్‌లో పార్ట్ టైమ్ జాబ్ ఆఫర్ అంటూ లింక్ వచ్చింది. దీనికి రోహన్ లింక్ ఓపెన్ చేసి ఆ తర్వాత అక్కడ ఉన్న సూచనల మేరకు టెలిగ్రామ్‌లో కనెక్ట్ అయ్యాడు. ఆన్‌లైన్‌లో కొంత పనిని ఇవ్వగా ఫిర్యాదుదారుడుపూర్తి చేశాడు. లాభం కోసం కొంత పెట్టుబడి పెట్టాలని మోసగాళ్లు నమ్మించారు. వారిని నమ్మి రూ. 1,03,000 బదిలీ చేశాడు. అప్పటి నుంచి వారు స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంగముత్తు శ్రీనివాస్‌కు దళితరత్న అవార్డు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు అంగముత్తు శ్రీనివాస్‌కు దళితరత్న అవార్డు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున డాక్టర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల సందర్భంగా సంఘ సేవకులను దళితరత్న అవార్డుతో సత్కరిస్తారు. ఆదివారం ఐడిహెచ్ కాలనీలో ఎస్సీఆర్పీ రాష్ట్ర అధ్యక్షులు రాజు ఉస్తాద్ దళితరత్న అవార్డును అంగముత్తు శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాజు ఉస్తాద్ మాట్లాడుతూ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ ఆశయాలతో దళితుల అభివృద్ధి, వికాసానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంగముత్తు శ్రీనివాస్‌కు దళితరత్న అవార్డు అందజేస్తున్న రాజు ఉస్తాద్

కిందిబస్తీ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు



కిందిబస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ కిందిబస్తీలో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. కిందిబస్తీలోని పలు ప్రాంతాల్లో ఆమె ఆదివారం పర్యటించారు. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి నల్లపోచమ్మ ఆలయం వద్ద చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్‌వైర్లపై పడి విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని స్థానికులు వివరించారు. కార్పొరేటర్ అందించిన సమాచారం మేరకు డీఆర్‌ఎఫ్ బృందాలు చెట్టు కొమ్మలను తొలగించారు.

తరచూ వైద్య పరీక్షలు చేయించుకోండి



ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్‌వ్యూ పార్క్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఖైరతాబాద్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవనం కొనసాగించాలంటే అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్లు భానుప్రదీప్, డాక్టర్ సమీర్‌లు తెలిపారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని శ్రీకర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పార్క్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి వైద్య సలహాలు అందజేశారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వివేకానంద సేవా సమితి సభ్యులు, శ్రీకర హాస్పిటల్ డాక్టర్ సుమధుర, వాకర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎఫ్‌నగర్‌లో కంటి ఉచిత వైద్య శిబిరం..

రహమత్‌నగర్: శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఎఫ్‌నగర్‌లో ఆదివారం కంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సేవకుడు శ్యాంసుందర్, బస్తీ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్, బస్తీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

10న ఓయూ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నాన్‌టీచింగ్ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు విడుదల చేశారు. సొసైటీలో 9 పదవులకు ఈ నెల 10 జరిగే సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలకు నేటి నుంచి (5న) నామినేషన్లను స్వీకరించనున్నారు. 7న నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికల గుర్తులను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు క్యాంపస్‌లోని నాన్‌టీచింగ్ హోంలో జరగనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మేడి రమణ ఆదివారం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి ఇంత వరకు ఒక్క శాఖలో కూడ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయకపోవడం విచారకరమన్నారు.ఎస్సీ, ఎస్టీల ఉద్యోగాలను భర్తీ చేయకుండ ఖాళీగా ఉంచడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు. ప్రభుత్వ శాఖలతో పాటు వర్సిటీలలో ఖాళీగా బ్యాక్‌లాగ్ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసి ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ ర్యాలీ

ముషీరాబాద్: దేశంలో కొన్ని విచ్ఛిన్నకర శక్తులు భారత రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలు చేస్తున్నాయని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జై బాపు... జై భీమ్.. జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ భారత రాజ్యాంగ పుస్తకాన్ని చేతపట్టి ర్యాలీలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ రాజకీయ దురుద్దేశంతో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరుచుతూ మాట్లాడినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. భారత రాజ్యాంగాన్ని, విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

పద్మారావునగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను, ఆదర్శలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగులూరి సాయిబాబా సహకారంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆదివారం హమాల్‌బస్తీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగులూరి సాయిబాబా, ఎస్సీఆర్పీ అధ్యక్షులు డి. సుదర్శన్‌బాబు, బస్తీ నాయకులు సుభాష్, యాదగిరి, దేవేందర్, కుషాల్ తదితరులు మాట్లాడారు.



వైభవంగా శాంతి కల్యాణ మహోత్సవం





అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి శాంతి కళ్యాణ మహోత్సవము ఆదివారం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ప్రాణ ప్రతిష్ట మహాపూర్ణాహారతి ప్రత్యేక పూజల అనంతరం స్వామి వార్ల శాంతి కళ్యాణము నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి నరేందర్ రెడ్డి, చైర్మన్, ఫౌండర్ ట్రస్టీ బొడ్డు కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మాకు మేమే సాటి..

ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత

శ్రీనగర్‌కాలనీ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మాకు మేమే సాటి అని నిరూపించారు ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు. ప్రతి సంవత్సరం వందశాతం ఉత్తీర్ణతతో పాటు 80శాతంపైగా మార్కులతో వారి ప్రతిభను చూపడం ప్రశంసనీయమని ఆశ్రయ్–ఆకృతి సంస్థ డైరెక్టర్ డీపీకే బాబు, అకడమిక్ డైరెక్టర్ డి.శశికళ అన్నారు. శ్రీనగర్‌కాలనీ ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో ఆదివారం అభినందన సభను ఏర్పాటు చేశారు. బధిరులైనా వారి ప్రతిభాపాటవాలు ఇతరులకు ఆదర్శమని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు.



వందశాతం ఉత్తీర్ణత సాధించిన ఆశ్రయ్-ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు

చైన్ స్నాచింగ్

వెంగళరావునగర్: బహుర్భూమికి వెళ్లిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును యువకుడు లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే మంగళం శంకరమ్మ ప్రతిరోజు యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్, బస్తీల్లోని ప్రాంతాల్లో హౌస్‌కీపింగ్‌గా పని చేస్తోంది. ఆదివారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తూ పక్కనే ఉన్న కల్లు దుకాణంలో కల్లు సేవించింది. అనంతరం జానకమ్మతోట సమీపంలో బహుర్భూమికి వెళ్లింది. ఆ సమయంలో దాదాపు 25–27 ఏళ్ల మధ్య ఉన్న యువకుడు ఆమె వద్దకు వచ్చి అరిచి గొడవ చేస్తే రాళ్లతో కొడతానని బెదిరించాడు. తీవ్రంగా భయపడిన ఆమె మౌనంగా ఉండటంతో ఆమె మెడలోని దాదాపు మూడున్నర తులాలు బంగారు గొలుసు లాక్కుని పరిగెత్తాడు. బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాలకోవ వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన పాలకోవ వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే వై.నాగుబాబు జూనియర్ ఆర్టిస్ట్. షూటింగ్స్ లేని సమయంలో పాలకోవ విక్రయిస్తుంటాడు. ఈనెల 2న రాత్రి పాలకోవ వాహనాన్ని తన ఇంటి ముందు పార్క్ చేసి మరుసటి రోజు వచ్చి చూసేసరికి కనిపించలేదు. చుట్టు పక్కల అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేదు. దాంతో ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధితుడికి తెలియకుండానే నగదు విత్‌డ్రా

మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్: మధురానగర్ హాస్టల్‌లో ఉంటున్న ప్రవీణ్‌కుమార్ ఈనెల 2న తన బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను చెక్ చేసుకున్నాడు. అయితే అతడికి తెలియకుండా గత నెల 29న రూ.18వేలు, ఈనెల 1న మరో రూ.7వేలు నగదు విత్‌డ్రా అయినట్లు గుర్తించాడు. వెంటనే అతడు సైబర్‌క్రైమ్ పోలీసులకు జరిగిన విషయాన్ని తెలిపి ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మిస్ వరల్డ్‌తో మోక్షం!

- పాడుపడిన ట్రాన్స్‌ఫార్మర్లు, పాత స్తంభాల తొలగింపు
- రంగంలోకి దిగిన విద్యుత్ అధికారులు





బంజారాహిల్స్: ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ సిటీ ముస్తాబవుతోంది. మే 7 నుంచి 31 వరకు హైటెక్స్‌లో జరిగే పోటీల కోసం సుందరాంగులు నగరానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగరాన్ని సుందరీకరించే దిశలో వివిధ శాఖలు సమన్వయంతో ముందుకుసాగుతున్నాయి. ముఖ్యంగా అందగత్తెలు రాకపోకలు సాగించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న వైర్లు, తుప్పుబట్టిన కరెంటు స్తంభాల తొలగింపు, మరమ్మతులు చేస్తోంది. ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సబ్‌స్టేషన్ల పరిధిలో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, లైన్‌మెన్లు, సిబ్బంది ఆదివారం మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.

- బంజారాహిల్స్ రోడ్డు నం.12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఈనెల 18న సుందరాంగులు రానున్న నేపథ్యంలో ఈ రోడ్డులో శిథిలావస్థకు చేరిన 12 ట్రాన్స్‌ఫార్మర్లను మార్చారు. తుప్పుబట్టిన కరెంటు స్తంభాల స్థానంలో కొత్తవి వేశారు. వేలాడుతున్న కేబుల్ వైర్లను సరిజేశారు. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేస్తున్న సుందరాంగులు తమ షెడ్యూల్‌లో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించనున్నారు. అలాగే పోటీలు జరిగే హైటెక్స్‌కు కూడా ఈ ప్రాంతాల నుంచే వెళ్తారు.
- ఇక్కడ ఉన్న స్టార్ హోటళ్లలోనే వారంతా బస చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు గత వారం రోజులుగా సుందరాంగులు రాకపోకలు సాగించే, పర్యటించే ప్రాంతాలను సర్వే చేశారు. రోడ్డు మార్గంలో వెళ్లే క్రమంలో ఎక్కడెక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు శిథిలావస్థకు చేరాయో వాటిని గుర్తించారు.
- ఓవైపు ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల జాబితాను తయారు చేశారు. దీని ఆధారంగానే ఆదివారం నుంచి మరమ్మతులు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు ఈ పనులు కొనసాగనున్నాయి. టీజీఎస్‌పీడీసీఎల్ ఫిలింనగర్ సబ్‌స్టేషన్ ఏఈ పవిత్ర పర్యవేక్షణలో 30 మంది సిబ్బంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. దాదాపు అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోనూ పనులు చేస్తున్నారు.